## సీఏ ఫైనల్ పరీక్షలు ఇక ఏడాదికి మూడుసార్లు

న్యూఢిల్లీ: సీఏ ఫైనల్ పరీక్షలు ఇక ఏడాదిలో మూడుసార్లు జరగనున్నాయి. ప్రస్తుతం ఏడాదికి రెండుసార్లు జరుగుతున్న సీఏ ఫైనల్ పరీక్షలు ఈ సంవత్సరం నుంచి మూడు సార్లు జరుగుతాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) గురువారం ప్రకటించింది. ఇంటర్మీడియట్, ఫౌండేషన్ కోర్సు పరీక్షలను ఏడాదికి మూడుసార్లు నిర్వహించాలని గత ఏడాది నిర్ణయం తీసుకోగా ఈ ఏడాది సీఏ ఫైనల్ పరీక్షలను కూడా అదే విధంగా మూడుసార్లు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు ఐసీఏఐ తెలిపింది. దీంతో సీఏ ఫైనల్, ఇంటర్మీడియట్, ఫౌండేషన్ అనే మూడు స్థాయిలు ప్రతి సంవత్సరం సమానంగా మూడు అవకాశాలు కల్పిస్తాయని ఐసీఏఐ ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి, మే, సెప్టెంబర్‌లో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఆడిట్‌లో పోస్ట్ క్వాలిఫికేషన్ కోర్సులో కూడా మార్పులు జరుగుతాయని పేర్కొంది. గతంలో రెండుసార్లు జరిగే అసెస్‌మెంట్ టెస్టు ఫిబ్రవరి, జూన్, అక్టోబర్‌లో మూడుసార్లు జరుగుతాయని ఐసీఏఐ తెలిపింది.

## కేంద్ర సర్కారు ట్యాక్సీ సేవలు

- ఉబర్, ఓలా, ర్యాపిడోలకు చెక్
- 'సహకార్ ట్యాక్సీ' పేరిట ప్రభుత్వ సంస్థ ప్రారంభం

న్యూఢిల్లీ: పౌరులకు బైక్, ఆటో, క్యాబ్ ద్వారా రవాణా సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'సహకార్ ట్యాక్సీ'ని ప్రారంభిస్తున్నట్టు గురువారం ప్రకటించింది. దేశంలో సేవలందిస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి కార్పొరేట్ సంస్థలతో తమ లాభాలను పంచుకుంటున్న డ్రైవర్లు నేరుగా తామే పూర్తి సంపాదనను సొంతం చేసుకొనేలా ఈ సహకార ఆధారిత రవాణా సేవలను ప్రారంభిస్తున్నట్టు తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో వెల్లడించారు. ఈ పథకాన్ని అమలులోకి తెచ్చేందుకు సహకార శాఖ మూడున్న రేండ్లుగా కష్టపడుతున్నదని తెలిపారు. ఈ పథకం అమలును ఆయన వివరిస్తూ.. దేశవ్యాప్తంగా ఉన్న రవాణా సేవలందించే ద్విచక్ర వాహనదారులు, ఆటోరిక్షాలు, క్యాబ్ డ్రైవర్లు 'సహకార్ ట్యాక్సీ సర్వీస్'లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రయాణికులను రవాణా చేయడం ద్వారా వసూలు చేసే మొత్తం చార్జీలను డ్రైవర్లే ఉంచుకుంటారని, ప్రభుత్వ సంస్థకు వాటా చెల్లించాల్సిన అవసరముండదని వివరించారు. తద్వారా డ్రైవర్లకు ఆర్థిక భద్రత కలుగుతుందని అన్నారు. కొన్ని నెలల్లోనే సహకార్ ట్యాక్సీ దేశమంతటా విస్తరిస్తుందని తెలిపారు.

## భారత్ ఏమీ ధర్మసత్రం కాదు

- అక్రమ వలసవాదులపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- వలస, విదేశీయుల చట్టానికి లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ: పర్యాటకులుగా, విద్యార్థులుగా, చికిత్స కోసం రోగులుగా, వ్యాపారులుగా వచ్చే వారిందరికీ స్వాగతం పలకడానికి భారత్ సిద్ధమేనని, అయితే ఎవరైతే బెదిరింపులకు పాల్పడతారో అటువంటి వారి పట్ల మాత్రం తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మోసపూరిత ఆలోచనలతో భారత్‌లోకి వచ్చే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, అలాంటి వారికి ఆశ్రయం కల్పించడానికి ఇదేమీ ధర్మసత్రం కాదని వ్యాఖ్యానించారు. వలస, విదేశీయుల బిల్లును గురువారం లోక్‌సభలో ఆమోదించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనుకునే వారికి తామెప్పుడూ స్వాగతం పలుకుతామని అన్నారు. ఈ వలస, విదేశీయుల బిల్లుతో దేశ రక్షణ పటిష్ఠం అవుతుందని షా పేర్కొన్నారు. బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు భారత్‌లోకి అక్రమంగా చొరబడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ వారి వల్ల దేశం అసురక్షితంగా మారిందన్నారు. చొరబాటుదారులు అశాంతి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

# కర్ణాటకలో అంతులేని అవినీతి

- లంచాల కోసం వ్యాపారులను అధికారులు వేధిస్తున్నారు
- మిమ్మల్ని ఎన్నుకున్నది సుపరిపాలన అందిస్తారని..
- అవినీతిని, లంచాలను ప్రోత్సహించడానికి కాదు
- ఇకనైనా అవినీతి, లంచాల సంస్కృతిని అడ్డుకోండి
- కర్ణాటక సర్కార్‌ను కోరిన ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్

బెంగళూరు, మార్చి 27: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అవినీతి పెచ్చరిల్లిందని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లంచాల కోసం వ్యాపారులను ప్రభుత్వ అధికారులు వేధిస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా ఈ వేధింపులను అడ్డుకోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లను ఆయన కోరారు. ప్రభుత్వ శాఖల్లో లంచాల డిమాండ్లపై సోషల్ మీడియాలో ఓ జర్నలిస్టు పెట్టిన పోస్టు వైరల్ కావడంతో మోహన్‌దాస్ స్పందించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా బెంగళూరులోని చిన్న వ్యాపార సంస్థలపై ప్రభుత్వ అధికారుల వేధింపులు ఆగడం లేదంటూ జర్నలిస్టు సాగరిక పెట్టిన పోస్టుకు స్పందనగా మోహన్‌దాస్ ట్వీట్ చేశారు. బెంగళూరులో ఓ చిన్న స్పోర్ట్స్ గూడ్సు స్టోర్‌ను నడుపుతున్న తన మిత్రుడు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె తన పోస్టులో వివరించారు. లక్షల్లో ముడుపులు చెల్లించాలంటూ అధికారులు నిత్యం వేధించడాన్ని ఆమె ప్రస్తావించారు. దీనిపై మోహన్‌దాస్ స్పందిస్తూ చిన్న వ్యాపార సంస్థల యజమానులపై వేధింపులు, లంచాల పీడింపులను వెంటనే అడ్డుకోవాలని ఆయన సీఎం, డిప్యూటీ సీఎంని కోరారు.

**అవినీతి నుంచి మమ్మల్ని కాపాడండి**

'మీరు వాగ్దానం చేసిన మేరకు సుపరిపాలనను అందిస్తారని మిమ్మల్ని ఎన్నుకున్నాము. ఈ రకమైన మితిమీరిన అవినీతి, లంచాలను ప్రోత్సహించడానికి మాత్రం కాదు' అంటూ సిద్ధరామయ్య సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి గత ప్రభుత్వాలు కూడా బాధ్యులేనని మోహన్‌దాస్ స్పష్టం చేశారు. అధికారంలో ప్రస్తుతం ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాబట్టి బాధ్యత దానిపైనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ అవినీతి, లంచాల సంస్కృతిని ఇకనైనా అడ్డుకోండి అని ఆయన కోరారు. 'ఈ వేధింపులు, అంతులేని అవినీతి నుంచి మమల్ని కాపాడండి' అని వ్యాపారుల తరపున ఆయన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

### బెంగళూరు సిగ్గుతో తలదించుకోవాలి!

సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన బెంగళూరు నగర రోడ్లు మరోసారి వార్తలకెక్కాయి. బయోకాన్ వ్యవస్థాపకురాలు, ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా పోస్టు చేసిన ఓ ట్వీట్ చర్చనీయాంశమైంది. బెంగళూరు రోడ్ల దుస్థితిపై ఆమె ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్వెడార్‌లోని శాన్ క్రిస్టోబాల్ ద్వీపంలోని రోడ్లే ఇంత కన్నా మెరుగ్గా ఉన్నాయంటూ ఆమె పోలిక తీసుకువచ్చారు. క్రిస్టోబాల్ ద్వీపంలోని పరిశుభ్రమైన వీధులు, చక్కని రోడ్లను చూపించే ఓ వీడియోను ఆమె షేర్ చేస్తూ 'బెంగళూరు.. సిగ్గుతో తలదించుకో' అంటూ మజుందార్ చురకలు అంటించారు. బృహత్ బెంగళూరు మహానగర పాలిక(బీబీఎంపీ) ప్రత్యేక కమిషనర్‌ని ట్యాగ్ చేస్తూ ఆమె చేసిన ట్వీట్ ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. కిరణ్ వైఖరిని కొందరు సమర్థించగా మరికొందరు భిన్నంగా స్పందించారు. ఐటీ హబ్ నగరమైన బెంగళూరు కన్నా అనేక భారతీయ నగరాలలో మౌలిక సౌకర్యాలు చాలా మెరుగ్గా ఉన్నాయని కొందరు నెటిజన్లు పేర్కొన్నారు. ఈక్వెడార్ అంత దూరం వెళ్లనవసరం లేదు.. మైసూరు, ఇండోర్, సూరత్, రాజ్‌కోట్‌లను సందర్శిస్తే చాలు అంటూ మరో యూజర్ వ్యాఖ్యానించారు. దీనికి కిరణ్ షా సమాధానమిస్తూ అయితే వర్ధమాన దేశమైన ఈక్వెడార్‌లో స్థానిక మున్సిపాలిటీ ఎంత చక్కగా పనిచేస్తోందో చెప్పడమే తన ఉద్దేశమని తెలిపారు. పౌర సమస్యల కన్నా ప్రజలకు భాషా రాజకీయాలే ఎక్కువై పోయాయని ఓ నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రాథమిక హక్కుల కోసం పోరాడడం మాని కన్నడలో మాట్లాడడం గురించే ప్రజలు ఎక్కువ ఆందోళన చెందుతున్నారని, దురదృష్టవశాత్తు బెంగళూరులో ప్రాథమిక సౌకర్యాలు ఎన్నటికీ ఏర్పడబోవని ఆ నెటిజన్ అభిప్రాయపడ్డారు.

# కన్నడిగులపై పాల ధరల పిడుగు

- కాంగ్రెస్ సర్కారు మరో బాదుడు
- లీటర్ పాలపై ఏకంగా రూ.4 పెంపు
- ఏడాది కాకుండానే రెండోసారి వాత
- కొండెక్కనున్న పాల ఉత్పత్తుల ధరలు

బెంగళూరు, మార్చి 27: మొన్న ఆర్టీసీ, నిన్న మెట్రో, పవర్ చార్జీలు.. ఇప్పుడు పాల ధరలు.. వరుస చార్జీల బాదుడుతో కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు సామాన్యుడి నడ్డి విరుస్తున్నది. గ్యారెంటీల అమలు సంగతి దేవుడెరుగు.. ఏ రోజు ఏ చార్జీలు పెంచుతారేమోనని ప్రజలు భయపడిపోతున్నారు. తాజాగా పాలపై లీటరుకు ఏకంగా రూ.4 పెంచుతున్నట్టు ప్రభుత్వం గురువారం ప్రకటించింది. సిద్ధరామయ్య నేతృత్వంలో సమావేశమైన మంత్రివర్గం పాల ధరల పెంపునకు ఆమోదం తెలిపింది. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని మంత్రి కేఎన్ రాజన్న తెలిపారు. ఏడాది తిరగకుండానే పాల ధరలు పెంచడం ఇది రెండోసారి.

**పండగ ముందు ధరల వాత**

పాల సమాఖ్యలు, రైతుల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు ధరను పెంచక తప్పలేదని మంత్రి రాజన్న మీడియాకు చెప్పారు. వారు లీటరుకు రూ.5 పెంచాలని కోరగా, ప్రభుత్వం రూ.4 పెంచిందని, పెంచిన మొత్తమంతా రైతులకే వెళ్తుందని ఆయన చెప్పారు. నందిని బ్రాండ్ పేరుతో కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) తన ఉత్పత్తులను అమ్ముతున్నది. కాగా, ఇప్పటికే రాష్ట్రంలో, బస్సు, మెట్రో, కరెంట్ చార్జీలు పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఉగాదికి ముందు పాల ధరను కూడా పెంచడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. పాల ధర పెంపుతో టీ, కాఫీ, స్వీట్లు, హోటళ్లలోని ఇతర పాల ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. ఈ ధరల పెంపుతో ఇప్పటివరకు రూ.44కు లభిస్తున్న నందిని లీటర్ పాల ప్యాకెట్ రూ.48 అవుతుంది. కర్ణాటక ప్రభుత్వం 2024 జూన్‌లో పాల ధరను లీటర్‌కు రూ.2 పెంచింది.

### కేంద్రం మరో 8 లక్షల కోట్ల అప్పు

న్యూఢిల్లీ: 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో రూ.8 లక్షల కోట్లు రుణాలుగా సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ లోటును భర్తీ చేసుకోవడానికి సెక్యూరిటీల జారీ ద్వారా ఈ మొత్తాన్ని సమీకరించనున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 14.82 లక్షల కోట్లను మార్కెట్ నుంచి అప్పుగా తీసుకోవాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇందులో భాగంగా తొలి ఆరు నెలల్లో రూ.8 లక్షల కోట్లను సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### 2 వేల వీసా అపాయింట్‌మెంట్‌లు రద్దు

**భారత్‌లో యూఎస్ ఎంబసీ వెల్లడి**

న్యూఢిల్లీ: భారత్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం 2 వేలకు పైగా వీసా అపాయింట్‌మెంట్‌లను రద్దు చేసింది. 'బ్యాడ్ యాక్టర్స్(బాట్స్)' అపాయింట్‌మెంట్ సిస్టమ్ ద్వారా తప్పుడు చర్యలతో వీసా నిబంధనలను ఉల్లఘించిన దరఖాస్తుదారులపై ఈ మేరకు చర్యలు తీసుకుంది. 'భారత్‌లోని మా టీమ్ 2 వేలకు పైగా వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేసింది. మా షెడ్యూలింగ్ విధానాలను ఉల్లంఘించిన ఏజెంట్లు, ఫిక్సర్లపై మేము ఎలాంటి కనికరం చూపించం' అని భారత్‌లోని యూఎస్ ఎంబసీ బుధవారం ఎక్స్‌లో పేర్కొంది. కొన్నేండ్లుగా విద్యార్థి వీసాల మంజూరులో తగ్గుదల కనిపిస్తున్నది.

### త్వరలో పుతిన్ భారత పర్యటన

**మోదీ ఆహ్వానానికి అంగీకారం**

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానాన్ని పురస్కరించుకుని భారత్‌ను సందర్శించడానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అంగీకరించారు. గత ఏడాది రష్యాను సందర్శించిన మోదీ భారత్‌ను సందర్శించవలసిందిగా పుతిన్‌ను ఆహ్వానించారు. పుతిన్ భారత పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ తెలిపారు. పుతిన్ త్వరలోనే మరణిస్తారని, అప్పుడు యుద్ధం ఆగిపోతుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. పుతిన్ అనారోగ్యంపై ఇటీవల వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

### డమ్మీ స్కూళ్ల విద్యార్థులపై సీబీఎస్‌ఈ వేటు!

**బోర్డు పరీక్షలకు అనుమతించబోమని వెల్లడి**

న్యూఢిల్లీ: రెగ్యులర్ పాఠశాలకు హాజరుకాని సీబీఎస్‌ఈ విద్యార్థులను 12వ తరగతి బోర్డు పరీక్షల్లో హాజరయ్యేందుకు అనుమతించబోమని అధికారులు ప్రకటించారు. డమ్మీ స్కూళ్లలో చేరినందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. డమ్మీ స్కూళ్లపై ఉక్కుపాదం మోపుతున్న సీబీఎస్‌ఈ పరీక్షల బైలాస్‌ను సవరించే విషయాన్ని పరిశీలిస్తోంది. ప్రతిపాదిత మార్పుల కింద డమ్మీ స్కూళ్ల విద్యార్థులను 12వ తరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతించరు. వారు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) పరీక్షను రాయవచ్చు.

### ముగ్గురు పోలీసుల వీరమరణం

- ఇద్దరు ఉగ్రవాదులు హతం
- జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

శ్రీనగర్: జమ్ముకశ్మీరులోని కఠువా జిల్లాలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న యాంటీ టెర్రర్ ఆపరేషన్‌లో గురువారం ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పోలీసులు వీర మరణం పొందారు. గాయపడిన ఇద్దరు పోలీసులకు దవాఖానలో చికిత్స జరుగుతున్నది. జఖోలే గ్రామం సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ప్రాంతానికి అదనపు బలగాలను పంపిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు-భద్రతా దళాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయని చెప్పారు.

### జస్టిస్ వర్మ బదిలీ ఉపసంహరించుకోండి

**సీజేఐకి హైకోర్టు బార్ అసోసియేషన్ల డిమాండ్**

న్యూఢిల్లీ: దేశంలోని వేర్వేరు హైకోర్టు బార్ అసోసియేషన్ల అధ్యక్షులు సీజేఐ సంజీవ్ ఖన్నాను గురువారం కలిసి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సీజేఐని కలిశాక కర్ణాటక హైకోర్టు బార్ మాట్లాడారు. ఈ విషయంలో సమగ్ర విచారణ చేయిస్తామని సీజేఐ తమకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. జస్టిస్ వర్మపై క్రిమినల్ న్యాయ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆయన బదిలీ ఆపాలని వివిధ హైకోర్టు బార్ అసోసియేషన్లు కోరాయి. జస్టిస్ వర్మను పరిపాలన, న్యాయపరమైన విధులకు దూరంగా ఉంచాలని అవి డిమాండ్ చేశాయి. వర్మ బదిలీని ఉపసంహరించకపోతే అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ సమ్మెకు మద్దతుగా సమావేశం కావాలని అన్ని రాష్ట్రాల హైకోర్టు బార్ అసోసియేషన్ల అధ్యక్షులు నిర్ణయించారు.

## అదో పొలిటికల్ బ్లాక్ కామెడీ

**యూపీ సీఎం యోగి వ్యాఖ్యలపై తమిళ నాడు సీఎం ఎంకే స్టాలిన్**

చెన్నై, మార్చి 27: నియోజకవర్గాల పునర్విభజన, భాషా విధానంపై తమ పాలసీని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విమర్శించడాన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తప్పుబట్టారు. యోగి తమకు పాఠాలు నేర్పడం పొలిటికల్ బ్లాక్ కామెడీలా ఉందని ఎద్దేవా చేశారు. ప్రాంతం, భాష ఆధారంగా చీలికలు తేవడానికి స్టాలిన్ ప్రయత్నిస్తున్నారని, దాని కారణంగా దేశం బలహీన పడుతుందని ఇటీవల యోగి చేసిన విమర్శలపై స్టాలిన్ ఎక్స్‌లో గురువారం స్పందించారు. డీలిమిటేషన్ పేరుతో జరిగే పార్లమెంట్ నియోజక వర్గాల పెంపు న్యాయబద్ధంగా ఉండాలని తాము కోరుకుంటున్నామని ఆయన చెప్పారు. ద్వి భాషా విధానం, డీలిమిటేషన్‌లపై రాష్ట్రాలు న్యాయమైన, దృఢమైన స్వరం విన్పించడంతో పాటు దేశ వ్యాప్తంగా కదలిక తెచ్చామని, ఇది బీజేపీ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్నట్టు కన్పిస్తున్నదని అన్నారు. 'సీఎం యోగి ఆదిత్యనాథ్ విద్వేషంపై మాకు ఉపన్యాసాలు ఇవ్వాలనుకుంటున్నారా? వదిలేయండి. ఇది వ్యంగ్యం కాదు, రాజకీయంగా చీకటి కామెడీ' అని ఆయన దీటుగా సమాధానం చెప్పారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించడం అభినందనీయమని స్టాలిన్ అన్నారు.

## రాష్ట్రాల సమ్మతి లేకుండానే సీబీఐ దర్యాప్తు!

న్యూఢిల్లీ, మార్చి 27: జాతీయ భద్రత, సమగ్రతలకు విఘాతం కలిగించే కేసులలో రాష్ట్రాల అనుమతి అవసరం లేకుండానే సీబీఐ దర్యాప్తు చేసేలా అధికారాలను కల్పించే ఓ ప్రత్యేక చట్టాన్ని చేయాలని పార్లమెంటరీ కమిటీ కేంద్రానికి సిఫార్సు చేసింది. తెలంగాణ, కర్ణాటక, జార్ఖండ్, తమిళనాడు, పంజాబ్ సహా బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న ఎనిమిది రాష్ట్రాలు సీబీఐ దర్యాప్తులకు అనుమతిని(జనరల్ కన్సెంట్) ఉపసంహరించుకున్న దరిమిలా అవినీతి, వ్యవస్థీకృత నేరాలను దర్యాప్తు చేయడం ఆ రాష్ట్రాలలో కేంద్ర దర్యాప్తు సంస్థకు అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాల అనుమతి లేకుండా సీబీఐ దర్యాప్తు చేసేందుకు వీలు కల్పించే విధంగా కొత్త చట్టాన్ని రూపొందించాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. కమిటీ నివేదికను గురువారం ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది.

# పరిహారం అందేదెన్నడు?

- మహాకుంభ్ బాధితులకు అందని పరిహారం
- రెండు నెలలైనా రాని చెక్కులు
- బహిర్గతం కాని మృతుల జాబితా
- డెత్ సర్టిఫికెట్లు జారీ చేయని వైనం
- యోగి సర్కారుపై బాధిత కుటుంబాల ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 27: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా సందర్భంగా తొక్కిసలాట జరిగి 30 మందికి పైగా భక్తులు మరణించి రెండు నెలలు దాటిపోయినప్పటికీ బాధిత కుటుంబాలకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రకటించిన రూ. 25 లక్షల పరిహారం ఇప్పటివరకు అందలేదు. బీజేపీ ప్రభుత్వం నుంచి హామీలు వచ్చినప్పటికీ మృతుల జాబితా వెల్లడి కాకపోవడం, నష్ట పరిహారం పరిస్థితిపై ప్రకటన ఏదీ వెలువడకపోవడంతో మృతుల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జనవరి 29న త్రివేణి సంగమం వద్ద తొక్కిసలాట జరుగగా మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటనేదీ ఇప్పటి వరకు యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కాని, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కాని వెల్లడించకపోవడం గమనార్హం. గడచిన రెండు నెలలుగా ఎక్కని మెట్టు, దిగని మెట్టు లేదన్న చందంగా బాధిత కుటుంబాలు అన్ని శాఖల అధికారులను కలుసుకుని తమ గోడు వెళ్లబోసుకుంటున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. అయితే తొక్కిసలాటలో మరణించినవారి మరణ ధ్రువీకరణ పత్రాన్ని(డెత్ సర్టిఫికెట్) సైతం అధికారులు తమకు అందచేయకపోవడం బాధిత కుటుంబాలను ఎక్కువగా వేదనకు గురిచేస్తోంది. నష్టపరిహారం కాని ధ్రువీకరణ పత్రాలు కాని తమకు ఏవీ అందలేదని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. త్వరలోనే మృతుల జాబితాను బహిర్గతం చేస్తామని రాష్ట్ర పోలీసులు హామీ ఇచ్చినప్పటికీ అది ఇంకా అమలుకాలేదు. తొక్కిసలాటలో 79 మంది వరకు మరణించారని కొన్ని పత్రికలు వెల్లడించగా 1,000 మంది వరకు మరణించారని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అప్పట్లో ప్రకటించారు.

### విషాహారానికి నలుగురు చిన్నారుల బలి

మానసిక వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు ఆశ్రయమిస్తున్న యూపీ ప్రభుత్వ పునరావాస కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. మంగళవారం భోజనం చేశాక 20కి పైగా పిల్లలు అస్వస్థతకు గురికాగా వీరిలో నలుగురు మరణించారు. మరో 16 మంది దవాఖానలో చికిత్స పొందుతున్నారు. లక్నోలోని పురా ప్రాంతంలో ఉన్న పునరావాస కేంద్రానికి చెందిన పిల్లలు అస్వస్థతకు గురయ్యారని, విషాహారం తినడం వల్ల ఇది జరిగి ఉండవచ్చని లక్నో జిల్లా మెజిస్ట్రేట్ విశాక్ జీ తెలిపారు. మరణించిన నలుగురు పిల్లల వయసు 12 నుంచి 17 ఏళ్ల మధ్య ఉంటుందని చెప్పారు.



# పంబన్ బ్రిడ్జి సిద్ధం!

**శ్రీరామనవమి రోజున ప్రారంభం**

*చెన్నై, మార్చి 27: గత శతాబ్ద కాలంగా రామేశ్వరం వెళ్లే పర్యాటకులను ఆకట్టుకుంటున్న తమిళనాడులోని పాత పంబన్ బ్రిడ్జి స్థానాన్ని కొద్దిరోజుల్లో కొత్త వంతెన ఆక్రమించనుంది. తమిళనాడులోని మండపం ప్రాంతం నుంచి పంబన్ దీవిలోని రామేశ్వరం వరకు 2.10 కిలో మీటర్ల పొడవున సముద్రంలో ఓ రైలు మార్గం ఉంది. సముద్రంలో ప్రయాణించే నౌకలు ఈ రైలు మార్గం వద్దకు వచ్చినప్పుడు వాటికి దారినిచ్చేందుకు రైలు మార్గం దానంతటే రెండుగా విడిపోయి రైలు గేటులాగా పైకి లేస్తుంది. దాదాపు 105 ఏండ్ల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జిని మాన్యువల్‌గా ఆపరేట్ చేస్తారు. అయితే ఇది పూర్తిగా పాతబడిపోవడంతో దాని స్థానంలో కొత్త బ్రిడ్జికి 2019 నవంబర్‌లో ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఆ బ్రిడ్జి నిర్మాణం 2024 సెప్టెంబర్‌లో పూర్తి కాగా వచ్చే నెలలో శ్రీరామనవమి సందర్భంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రూ.535 కోట్ల వ్యయంతో రైల్ వికాస్ నిగం లిమిటెడ్ సంస్థ ఈ వంతెనను నిర్మించింది. నౌకల రాకపోకల కోసం తెరుచుకొనేటప్పుడు పాత వంతెన రెండు రెక్కలుగా విడిపోతుంది. కాగా కొత్త వంతెన అమాంతం నిలువునా 22 మీటర్ల పైకి లేస్తుంది.*



## ఆ మూడు వృత్తులకు ఏఐతో ముప్పులేదు

**బిల్‌గేట్స్ అభిప్రాయం**

*న్యూఢిల్లీ, మార్చి 27: కృత్రిమ మేధ కారణంగా రాబోయే రోజుల్లో ఎన్నో రంగాల్లో ఉద్యోగాలు పోతాయని ప్రచారం జరుగుతున్న వేళ మూడు వృత్తులకు మాత్రం ఈ ఆటోమేషన్ ముప్పు తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్. ఏఐ తాకిడిని కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ రంగాలు తట్టుకుని నిలబడతాయని ఆయన చెప్పారు. సమస్యలు పరిష్కరించే సామర్థ్యం, పరిస్థితులకు తగ్గట్టుగా సామర్థ్యాన్ని మెరుగుపర్చుకునే లక్షణాలను ఏఐ ఇంకా సొంతం చేసుకోలేకపోవడమే దీనికి కారణమని ఆయన విశ్లేషించారు. ఏఐతో కోడింగ్, ఇతర పనులు చేసినా, అనుకోకుండా వచ్చే సవాళ్లను పరిష్కరించాలంటే ప్రోగ్రామర్స్ అవసరం తప్పనిసరిగా ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే ఎనర్జీ నిపుణులతో ఏఐ పోటీ పడలేదన్నారు.*

## మన రక్తం దోమలకు ఇక విషం!

*న్యూఢిల్లీ: మలేరియాకు కారణమై ఏటా వేలాది మందిని బలితీసుకుంటున్న దోమలపై సరికొత్త అస్త్రాన్ని శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. ముల్లును ముల్లుతోనే తీయాలన్న చందంగా.. మన రక్తం తాగుతున్న మలేరియా దోమలకు మన రక్తంతోనే చెక్‌పెట్టే విధానాన్ని కనుగొన్నారు. మనుషుల రక్తాన్ని మలేరియా కారక దోమలకు విషంగా మార్చడంలో శాస్త్రవేత్తలు పురోగతి సాధించారు. మనుషుల రక్తంలోకి నిటిసినోన్ ఔషధాన్ని ఎక్కించడం వల్ల మన రక్తం దోమలకు ప్రాణాంతకంగా మారుతుందని తమ అధ్యయనంలో తేల్చారు. అరుదైన జన్యు వ్యాధుల చికిత్స కోసం నిటిసినోన్‌ను వాడతారు. అయితే దీనివల్ల కలిగే అనుకోని సైడ్ ఎఫెక్ట్స్ దోమలకు ప్రాణాంతకమని.. ఈ ఔషధాన్ని వాడుతున్న రోగులపై పరిశోధన చేసిన సైంటిస్టులు ఇటీవల కనుగొన్నారు. ఈ ఔషధం రోగుల జీవక్రియలకు దోహదం చేయగా.. అదే సమయంలో ఆ రోగుల రక్తం తాగిన దోమల జీర్ణక్రియకు విఘాతం కలిగి 12 గంటల వ్యవధిలో అవి మరణించినట్లు వారు గుర్తించారు. నిటిసినోన్ దీర్ఘ కాలం పని చేస్తుందని.. ఇది మనుషులకు, పర్యావరణానికి ఎలాంటి హాని చేయదని వారు తెలిపారు.*

## భూభ్రమణం నుంచి విద్యుత్తు!

*న్యూయార్క్, మార్చి 27: భూభ్రమణాన్ని వినియోగించుకొని గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. భూ అయస్కాంత క్షేత్రం ద్వారా సహజ సిద్ధంగా జరిగే ఈ ప్రక్రియ నుంచి స్వల్ప మొత్తంలో విద్యుత్తును ఉత్పత్తి చేసినట్టు అమెరికా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ ప్రయోగం భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి మార్గం సుగమం చేసిందని వారు చెబుతున్నారు. ఈ మేరకు న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీకి చెందిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త క్రిస్టోఫర్ చిబా నేతృత్వంలో అధ్యయనం జరిగింది. అధ్యయనంలో భాగంగా మాంగనీస్ జింక్ ఫెరైట్‌తో తయారు చేసిన 29.9 సెంటీమీటర్ల పొడవైన హ్యాలోవ్ సిలిండర్‌ను భూ భ్రమణం, అయస్కాంత క్షేత్రానికి 90 డిగ్రీల కోణంలో ఉంచి ప్రయోగం చేశారు. ఇందులో 19 మైక్రోవోల్ట్స్ విద్యుత్తు ఉత్పత్తి అయినట్టు గుర్తించారు.*



## చూయింగ్ గమ్‌తో శరీరంలోకి మైక్రోప్లాస్టిక్స్

*న్యూఢిల్లీ: చూయింగ్ గమ్‌ను నమిలినపుడు నోట్లోకి వందలాది మైక్రోప్లాస్టిక్స్ విడుదలవుతాయి. రబ్బర్ ఆధారిత స్వీట్ వల్ల కాలుష్యం ఏర్పడుతుంది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం పరిశోధకుల అధ్యయనంలో ఇవి వెల్లడయ్యాయి. ప్రధాన పరిశోధకుడు సంజయ్ మొహంతి మాట్లాడుతూ చూయింగ్ గమ్ ద్వారా శరీరంలోకి మైక్రోప్లాస్టిక్స్ వెళ్తున్నట్టు తాజా పైలట్ స్టడీ వెల్లడించిందని చెప్పారు. ఒక గ్రాము గమ్ సగటున 100 మైక్రోప్లాస్టిక్ ముక్కలను విడుదల చేస్తుందని తెలిపారు. కొన్ని చూయింగ్‌గమ్స్ 600కుపైగా కణాలను విడుదల చేస్తాయన్నారు. సంవత్సరానికి 180 చూయింగ్ గమ్‌లను నమిలితే 30,000 మైక్రోప్లాస్టిక్స్ విడుదలవుతాయని చెప్పారు. సాధారణంగా వాడే సింథటిక్ గమ్‌లో పెట్రోలియం ఆధారిత పాలిమర్స్ ఉంటాయి. అయితే, దానిలో ప్లాస్టిక్స్ ఉన్నట్లు ప్యాకేజింగ్‌పై రాయరు.*